సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024





కలర్‌ఫుల్.. కార్నివాల్ నైట్
ఊర్రూతలూగిస్తున్న ఉత్కర్ష్

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థుల ఉత్కర్ష వేడుకలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి కార్నివాల్ నైట్‌ను కనుల పండువగా నిర్వహించారు. నోరూరించే ఫుడ్ స్టాల్స్‌తోపాటు ఆటపాటలతో హోరెత్తించారు. ఫ్యాన్సీ, పార్టీవేర్ దుస్తులతో ర్యాంపులపై హొయలొలికారు. సంప్రదాయ, వెస్ట్రన్ పాటలు పాడుతూ ఊర్రూతలూగించారు. - ఎంజీఎం

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓగా లలితాదేవికి పూర్తి బాధ్యతలు



ఎంజీఎం: హనుమకొండ ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు మంగళవారం పూర్తిస్థాయి డీఎంహెచ్‌ఓగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎహెచ్‌ఓకు అదనపు డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

నిజాయితీగా సేవలందించాలి



వరంగల్ క్రైం: వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు పోలీసు అధికారులు నిజాయితీగా సేవలందించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన 19 మంది ట్రెయినీ ఎస్సైలు మంగళవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్లను సీపీ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించే అవకాశం పోలీసులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. అలాంటి పోలీసు ఉద్యోగంలో చేరినందుకు గర్వపడాలని, ప్రజలకు సేవలందిస్తూ పోలీసు శాఖకు పేరు తేవాలని పోలీస్ కమిషనర్ సూచించారు

నేటి నుంచి అవగాహన సదస్సులు

రామన్నపేట: పొగాకు రహిత సమాజం కోసం బుధవారం నుంచి 60 రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం ఏవీవీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లా పొగాకు నియంత్రణాధికారి డాక్టర్ గోపాల్‌రావు, సిబ్బందితో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పొగాకు వాడడంతో పలు రకాల కేన్సర్ వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెగడపల్లి పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

హసన్‌పర్తి: పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ యేసుబుపై వేటు పడింది. సీఈఓను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార శాఖ అధికారి నీరజ ఉత్తర్వులు జారీ చేశారు. 'ఒకరికే రుణ మాఫీ' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. సొసైటీ పరిధిలో మొత్తం 1052 మంది రైతులు రుణాలు తీసుకున్నట్లు అధికారులు రికార్డులు సరిచూశారు. తీసుకున్న రుణాల్లో వడ్డీ జమ చేయడంలో సీఈఓ పొరపాటు చేసినట్లు అధికారులు విచారణలో గుర్తించారు. ఇందుకు బాధ్యుడిని చేస్తూ సీఈఓ యేసుబుపై వేటు వేశారు. మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ గణేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యపై బదిలీ వేటు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యపై బదిలీ వేటు పడింది. ఆయనను ఐజీకి అటాచ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 8న మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా మల్లయ్య బాధ్యతలు స్వీకరించారు. అనతికాలంలోనే ఆయనపై బదిలీ వేటు పడింది.

లోక్ అదాలత్ చిత్రం ప్రదర్శన

వరంగల్ చౌరస్తా: లోక్ అదాలత్ చిత్రాన్ని మంగళవారం సాయంత్రం వరంగల్ పీవీఆర్ మాల్‌లోని-ఎస్2 థియేటర్‌లో ప్రదర్శించారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా జడ్జి వి.నిర్మల వీక్షించారు. ఈనెల 28న లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలకు ఈ చిత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా లోకల్ చానల్స్‌తోపాటు సినిమా థియేటర్‌లో వీడియోపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. డీసీపీ రవీందర్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

రచ్చ.. చర్చ

వాడివేడిగా సాగిన 'గ్రేటర్' కౌన్సిల్ సమావేశం



సమావేశం హాల్ ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, హాల్ గేట్ ఎదుట బైఠాయించిన బీజేపీ కార్పొరేటర్లు

- ఆరంభంలోనే ఆందోళనలకు దిగిన విపక్ష కార్పొరేటర్లు
- అన్నీ తానై నడిపిన మంత్రి సురేఖ
- తొలిసారిగా హాజరై ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం
- రూ.100 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- రూ.30 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం
- కార్పొరేటర్ల ఇళ్లలో కార్మికులు పనిచేయవద్దని తీర్మానం
- కొత్తగా 250 మంది కార్మికుల నియామకానికి పచ్చజెండా
- సభ మధ్యలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల వాకౌట్..

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం రసాభాసగా మొదలై చర్చతో ముగిసింది. మేయర్ గుండు సుధారాణి సభలో ప్రసంగిస్తున్న తరుణంలో తమ డివిజన్లకు నిధుల కేటాయింపులో మేయర్ పక్షపాత ధోరణి ధోరణి అవలంబిస్తున్నారంటూ బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు పోటా పోటీగా నినాదాలు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విపక్ష కార్పొరేటర్లను వారించారు. దీంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు పోడియం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈలోగా రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కౌన్సిల్ సమావేశానికి తొలిసారిగా విచ్చేసి, ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అన్నీ తానై సభను సజావుగా నడిపించడంతో ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి ముందుగానే సమావేశం హాల్ ఎదుట బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ఆవరణలో బీజేపీ కార్పొరేటర్లు బైఠాయించి మేయర్ సుధారాణికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభం కావడంతో హాల్‌కు విచ్చేశారు. తొలుత ఇటీవల మృతిచెందిన కార్పొరేటర్ ఎలకంటి రాములు, మాజీ కార్పొరేటర్ ఎలుగం శ్రీనివాస్‌కు సంతాపం ప్రకటించి, మౌనం పాటించారు.

పలు సమస్యలను ప్రస్తావించిన సభ్యులు

రాష్ట్ర మంత్రి సురేఖ హాజరై ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలు ప్రస్తావించేందుకు అవకాశం కల్పించాలని సూచనలు చేశారు. దీంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, రాధికారెడ్డి బల్దియా వాహనాల పేరిట సాగుతున్న అవినీతి, డివిజన్లలో నెలకొన్న సమస్యలపై మాట్లాడారు. సభ్యుడు మరుపల్లి రవి, అధికార పార్టీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ పలుమార్లు మాట్లాడేందుకు ప్రయత్నించగా మేయర్ మైక్ కట్ చేశారు. ఎజెండాలోని అంశాలపై మంత్రి క్షుణ్ణంగా ప్రశ్నిస్తూ, అధికారులు, మేయర్‌ను వివరణ అడిగి, పలు మార్పులు, చేర్పులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లిపోయారు. ఇక అధికార పార్టీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ సమావేశం పూర్తికాక ముందే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అక్రమ నిర్మాణాలపై ఏం చేస్తున్నారు..



మంత్రి సురేఖ మాట్లాడుతూ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని, ఏం చేస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని సీఎంహెచ్‌ఓ రాజేశ్‌ను ప్రశ్నించగా, కార్మికుల కొరత ఉందన్నారు. కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది ఇళ్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను అక్కడినుంచి తొలగించి క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే విధంగా చూడాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలు, ఇళ్లను వదిలి వెళ్లిన వాటిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని నినాదాలు



ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో వాగ్వాదం చేస్తున్న విపక్ష సభ్యులు

సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ ఎజెండాను ప్రవేశ పెట్టి చదువుతున్న క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు పెద్ద పెట్టున తమ స్థానాల్లో నిలబడి నినాదాలు చేశారు. మేయర్ వైఖరిని తప్పుపట్టారు. అభివృద్ధి పనులపై నిలదీశారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ కార్పొరేటర్ల డివిజన్లకు మాత్రమే నిధులు కేటాయిస్తే మా పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జోక్యం చేసుకొని సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తామని, ఎజెండా పూర్తి కావాలని సముదాయించే ప్రయత్నం చేశారు. దీంతో విపక్ష సభ్యులు ఆయన సీటు వద్దకు వచ్చి మళ్లీ నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల పాలనలో తప్పిదాలను ప్రస్తావించడంతో కొంత మేరకు శాంతించగా, పోడియం ఎదుట నినాదాలు చేశారు.



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సమావేశానికి హాజరైన మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ప్రతిపక్ష, అధికార పార్టీ సభ్యులు

మహా నగరాభివృద్ధి లక్ష్యం

- పార్టీలకతీతంగా డివిజన్లకు నిధులు కేటాయిస్తాం
- మంత్రి కొండా సురేఖ

- వివరాలు 8లో▸

తీర్మానాలు ఇలా...

- రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.100 కోట్ల గ్రాంటు.
- ఇండోర్, కొచ్చి, తిరువనంతపురం స్మార్ట్‌సిటీల స్టడీ టూర్‌కు మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు వెళ్లాలి.
- వందశాతం ఇంటింటా చెత్త సేకరణ, నీటి సరఫరా ఇతర అవసరాల కోసం కొత్తగా 250 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి.
- 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.30 కోట్లు ఫిల్టర్ బెడ్ల నిర్వహణ, వాహనాల కొనుగోళ్లు, రిపేర్లు, ఎలక్ట్రికల్ లైట్లు, పరికరాలకు ప్రతిపాదనలకు ఆమోదం
- సీఎం ఫండ్‌తో 3 వర్క్స్, రూ.67 లక్షల నిధులను జనరల్ ఫండ్‌కు చెల్లించాలనే తీర్మానాన్ని తిరస్కరించి, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని మంత్రి సూచించారు.
- 2వ డివిజన్‌లో రూ.38 లక్షల అభివృద్ధి పనులకు సీఎం నిధులనుంచి కాకుండా జనరల్ ఫండ్ చెల్లించేందుకు అంగీకరించారు.
- 3,749 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ చార్జీల చెల్లింపునకు రూ.75.64 లక్షలు, స్వచ్ఛఆటో డ్రైవర్ కమ్ ఓనర్లకు 6 నెలల వేతనం రూ.1.85 కోట్లు, 8 మంది హోంగార్డుల వేతనం రూ.27.73 లక్షలు, విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుడు బోట్ల దేవస్వామికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, అన్నపూర్ణ పథకానికి 10 నెలలకు రూ.23.50 లక్షలు, మలేరియా కార్మికుల వేతనాలు ఏడాదికి 1.38 కోట్ల రూపాయలు చెల్లించాలి.
- ఆర్పీలపై మెప్మా టీఎం రమేశ్ తీరు బాగాలేదని, సస్పెండ్ చేయాలని మంత్రి తీర్మానం అందించగా, ఆయనను సస్పెండ్ చేయలేదని, మందలించినట్లు బల్దియా అధికారులు వెల్లడించారు.

ఎంఈఓల నియామకం

విద్యారణ్యపురి: ప్రతి మండలానికి ఒక ఎఫ్ఏసీ ఎంఈఓను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏ మండలంలో సీనియర్ పీజీ హెచ్‌ఎం ఉన్నారో.. అదే మండలానికి ఎఫ్ఏసీ ఎంఈఓగా ఆ హెచ్‌ఎంను నియమిస్తూ జాబితా విడుదల చేశారు.

హనుమకొండ జిల్లాలో ఎంఈఓలు వీరే..

ధర్మసాగర్ ఎఫ్ఏసీ ఎంఈఓగా డాక్టర్ బి.రాంధన్ (నారాయణగిరి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం) నియమితులయ్యారు. భీమదేవరపల్లి ఎ.వెంకటేశ్వర్ రావు (ముల్కనూరు హెచ్‌ఎం), కమలాపూర్ వి.రాంకిషన్‌రాజు (కమలాపూర్ హెచ్‌ఎం), పరకాల ఎస్.రమాదేవి, (వెల్లంపల్లి హెచ్‌ఎం), ఐనవోలు పి.ఆనందం (పంథిని హెచ్‌ఎం), హనుమకొండ కె.రమేశ్‌బాబు (హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం), నడికూడ కె.హనుమంతరావు (నడికూడ హెచ్‌ఎం), కాజీపేట మనోజ్‌కుమార్ (కడిపికొండ హెచ్‌ఎం), ఎల్కతుర్తి సీహెచ్.సత్యనారాయణ (తిమ్మాపూర్ హెచ్‌ఎం), ఆత్మకూరు ఎస్.విజయకుమార్ (అక్కంపేట హెచ్‌ఎం), దామెర బానోత్ జుమ్ము (దామెర హెచ్‌ఎం), శాయంపేట భిక్షపతి (గంగిరేణిగూడెం హెచ్‌ఎం), వేలేరు ఎంఈఓగా ఎం.చంద్రమౌళి (ఎర్రబెల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం) నియమితులయ్యారు.

కలెక్టరేట్‌లోకి డీఎంహెచ్‌ఓ కార్యాలయం

హన్మకొండ అర్బన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ములుగు రోడ్డు నుంచి హనుమకొండ కలెక్టరేట్‌లోకి మారనుంది. ఇందుకోసం ఐడీఓసీ అధికారులు కలెక్టరేట్‌లోని మూడో అంతస్తులో గదులను సమకూర్చారు. త్వరితగతిన డీఎంహెచ్‌ఓ కార్యాలయం మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మేరకు కార్యాలయాన్ని మార్చేందుకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు.

మైసూర్‌ను తలపించేలా ఏర్పాట్లు

- రంగలీల మైదానం దసరా ఉత్సవ కమిటీ సభ్యులతో మంత్రి కొండా సురేఖ



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం ఇస్తున్న దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంజయ్‌బాబు

ఖిలా వరంగల్: మైసూర్‌ను తలపించేలా రంగలీల మైదానంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈమేరకు మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని ఆమె నివాసంలో మంత్రి కొండా సురేఖను రంగలీల మైదానం సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. సద్దుల బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు రంగలీల మైదానానికి తరలివచ్చి దసరా వేడుకలను తిలకిస్తారని చెప్పారు. త్వరలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలపై సమీక్షించి ఏర్పాట్లు శరవేగంగా చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రి సురేఖను కలిసిన వారిలో ప్రతినిధులు మేడిది మధుసూదన్, మండ వెంకన్నగౌడ్, పరదేశి శివమూర్తి, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, పొగాకు సందీప్, సంజీవ్, అజయ్, అఖిల్‌గౌడ్, అశోక్, మహేశ్, శ్రీను, వేణు, మధు, నాగరాజు, అక్తర్, విజయ్, వంశీ, కృష్ణంరాజు, రంజిత్, మనోహర్, జయమహేశ్ ఉన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లకు మంత్రి ఆదేశం

కాశిబుగ్గ: నగరంలోని 35వ డివిజన్‌లో బతుకమ్మకు ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ బల్దియా అధికారులను ఆదేశించారు. 35వ డివిజన్ నాయకులు మంత్రి సురేఖను మంగళవారం కలిసి బతుకమ్మ ఆట స్థలం, బతుకమ్మ చెరువు సమస్యలను వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించి, బతుకమ్మకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు కాలనీ వాసులు తెలిపారు.

రెండు వద్దు.. ఒకటే ముద్దు!

హనుమకొండ, వరంగల్‌ను ఒక్కటి చేయాలని డిమాండ్

- ఓరుగల్లు జిల్లా కోసం మేధావులు, ప్రముఖుల ఐక్యవేదిక మరో ఉద్యమం
- రెండు జిల్లాల రద్దు నినాదంతో చర్చావేదికలు
- త్వరలోనే సీఎం, మంత్రులకు వినతి



వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒకే జిల్లాగా మార్చాలన్న చర్చావేదికలో ఐక్యవేదిక నాయకులు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

హనుమకొండ, వరంగల్ జిల్లాల రద్దు.. ఆ రెండూ కలిపి ఒకే జిల్లా (ఓరుగల్లు)గా ఏర్పాటు నినాదం మళ్లీ తెరపైకి వస్తోంది. జిల్లాల ఏర్పాటునుంచే వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలను రద్దు చేసి... ఒక్కటే జిల్లా చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రజాప్రతినిధులు, ప్రజా, ఉద్యమ సంఘాలు కూడా బలంగానే తమ వాణిని వినిపించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం పరిణామ క్రమంలో వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ పేర్లను మార్చి కొద్దిపాటి చేర్పులు, మార్పులతో హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి ఇబ్బడిముబ్బడిగా ఉన్న 33 జిల్లాల కుదింపు విషయంలో న్యాయనిపుణులను సంప్రదిస్తామని పేర్కొన్న విషయం తెలిసిందే. ఇదే క్రమంలో వరంగల్‌కు చెందిన మేధావులు, వ్యాపారవేత్తలు, సామాజిక వేత్తలు, ప్రజాసంఘాల నేతలు ఐక్యవేదికగా ఏర్పడి ఒకే జిల్లాగా మార్చాలన్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు.

ఆరు జిల్లాలైన ఓరుగల్లు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన రెండేళ్లకు.. సరిగ్గా 2016 అక్టోబర్ 11న రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. ఆ రోజు దసరా పండుగ. ఉద్యోగులు అధికారులు కొత్త జిల్లా కార్యాలయాలు, మండలాలు ఏర్పాటు కావడంతో వాటిలోనే పూజలు చేసి పండగ అక్కడే చేసుకున్నారు. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండల కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రైవేట్ అద్దె భవనాల్లో తమ కార్యాయాలు ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించాయి. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఆర్డర్ టు సర్వ్ పేరుతో కొత్త జిల్లాలకు బదిలీ అయ్యారు. అప్పటి పాత వరంగల్ జిల్లాను మొదట వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాలు ఏర్పాటు చేశారు. 2018 ఎన్నికల తర్వాత భూపాలపల్లి జిల్లా నుంచి ములుగును విడదీసి.. కొత్తగా ములుగు జిల్లాను ఏర్పాటు చేశారు. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల పేర్లు మార్చాలని ఆ రెండు జిల్లాల ఎమ్మెల్యేలు అప్పటి సీఎం కేసీఆర్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ఆ రెండు జిల్లాల్లో మండలాలను అటు ఇటుగా చేసి వరంగల్ అర్బన్‌ను హనుమకొండగా.. వరంగల్ రూరల్‌ను వరంగల్ జిల్లాగా 2021 ఆగస్టు 12న మార్చారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల కుదింపుపై దృష్టి సారించిన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాలను కుదించి ఒక్కటే జిల్లాను చేయాలన్న డిమాండ్ మళ్లీ తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది.

వరంగల్ ప్రాశస్త్యాన్ని చెరిపేశారు



తెలంగాణ రాష్ట్రం సాధిస్తే వరంగల్ నగరం హైదరాబాద్‌కు సమాంతరంగా ఒక ఆర్థిక, వాణిజ్య, విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగాలు కల్పించే కేంద్రంగా ఎదుగుతుందని భావించాం. ఉమ్మడి జిల్లాను ఆరు ముక్కలు చేయడం వల్ల వరంగల్ ప్రాశస్త్యం చెరిపేయబడింది. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా నగరాన్ని రెండు జిల్లాలుగా విడదీశారు. వరంగల్, హనుమకొండ రెండింటిని ఒకే జిల్లాగా తిరిగి ఏర్పాటు చేస్తే ఈ మహానగరం రాజధాని తర్వాత ఒక ముఖ్య ఆర్థిక కేంద్రంగా ఎదగడానికి అవకాశం ఉంది.

- కూరపాటి వెంకట నారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్, కేయూ

జిల్లాలో భారీ నుంచి తేలికపాటి వర్షం

హన్మకొండ: హనుమకొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి తేలిక పాటి వర్షం కురిసింది. సోమవారం రాత్రి కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. కాగా, భీమదేవరపల్లిలో అత్యధికంగా 58.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఇతర జిల్లాల్లో సాధారణానికి మించగా, హనుమకొండ జిల్లాలో మాత్రం సగటున 21.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమదేవరపల్లి, కాజీపేట, హనుమకొండ, ఎల్కతుర్తిలో భారీ వర్షం కురిసింది. కాజీపేటలో 52.4 మిల్లీమీటర్లు, హనుమకొండలో 47.6, హసన్‌పర్తిలో 20.4, కమలాపూర్‌లో 17.1, ధర్మసాగర్‌లో 13.7, దామెరలో 12, వేలేరులో 11.6, ఐనవోలులో 11, పరకాలలో 8.9, నడికూడలో 5.7, ఆత్మకూరులో 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శాయంపేటలో చినుకు పడలేదు.

నర్సరీ నిబంధనలు పాటించాలి

హన్మకొండ: నర్సరీ నిబంధనలు పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకోనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల ఉద్యాన శాఖాధికారి జి.సంగీత లక్ష్మి హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా నకిలీ విత్తనాలతో నారు పోసిన వారిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి జైలుకు పంపించి, రూ.50 వేల జరిమానా విధించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల మిర్చి, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల వంటి పంటలకు విత్తనాల బదులు నారు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన నర్సరీల నుంచి మాత్రమే రైతులు నారు కొనుగోలు చేయాలన్నారు. షేడ్‌నెట్ కింద పోసిన నారు మాత్రమే కొనాలని, ఆరుబయట పోసిన నారు కొనొద్దని సూచించారు.

రంగయ్యపల్లిలో ఇంటిపై పిడుగు..

● సుమారు రూ. 4లక్షల ఆస్తినష్టం



పిడుగుపాటుకు దగ్ధమైన సామగ్రి

ఎల్కతుర్తి: గాలిదుమారంతో కురిసిన భారీ వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదు మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రబోజు రాధిక ఇంటికి తాళం వేసి తన తల్లిగారి ఊరికి వెళ్లింది. సోమవారం రాత్రి భారీ వర్షంతో పాటు పిడుగు ఇంటిపై పడింది. ఈ ఘటనలో గోడలు పగుళ్లు చూపడంతో పాటు ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సామగ్రితో పాటు కొంత నగదు, బంగారం కాలిందని బాధితురాలు మంగళవారం కన్నీరుమున్నీరైంది. తమను ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సాయం అందజేయాలని వేడుకుంది. కాగా, పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

పత్తికి ఆపతి..



పత్తి పంటను ఆశించిన పేను బంక, పచ్చ దోమ, తామర పురుగు

తెల్లబంగారానికి ఆశిస్తున్న రసంపీల్చే పురుగులు

- రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్
- అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు

మహబూబాబాద్ రూరల్ : పత్తి.. తెల్లబంగారం. రైతుల ఇంట సిరులు కురిపించే పంట. అన్నదాతలకు అధిక లాభాలు అర్జించి పెట్టే ప్రధాన సాగు. అయితే ప్రస్తుతం పత్తి పంటను రసంపీల్చే పురుగులు ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను ఆ పురుగుల బారినుంచి రక్షించుకోవాలి. అప్పుడే పంట చేతికొస్తుంది. లేని పక్షంలో నష్టాల బారిన పడే అవకాశం ఉందని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్ అన్నారు. గత నెల, ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో చీడపీడల ఉధృతి అధికం కావడం, ప్రధానంగా రసంపీల్చే పురుగుల ఉధృతి పెరుగు



డాక్టర్ ఎస్.మాలతి



కె.క్రాంతికుమార్

తున్నట్లు గమనించామని తెలిపారు. ఈ నేపథ్యంలో పంట రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

పేను బంక ..

పత్తి పంటకు పేను బంక ఆశించినప్పుడు లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చడం, ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల మొక్కల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. పేను బంక నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీ లీటర్లు, థయోమిథాక్సాం 0.2 గ్రాములను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పచ్చ దోమ ..

పత్తి పంటకు పచ్చ దోమ ఆశించి ఆకుల అడుగు భాగంలో పిల్ల, తల్లి పురుగులు చేరుతాయి. ఆకుల నుంచి రసం పీల్చుతాయి. తద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులోకి మారుతాయి. పచ్చ దోమ నివారణకుగాను ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లోనికామైడ్ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు ఎసిఫేట్ 75 ఎస్.పీ 1.05 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్ల దోమ :

పత్తి పంటను తెల్ల దోమ పింద, కాయ దశలో ఆశిస్తుంది. ఆకుల మీద పచ్చదనం కోల్పోయి మచ్చలు ఏర్పడి, ఆకులు పెరగకుండా ముందే రాలిపోతాయి. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. తెల్ల దోమ నివారణకు డైఫెన్ థయూరాన్ ఒకటి పాయింట్ 2.05 గ్రాములను లీటర్ నీటికి లేదా స్పైరోమెసిసిన్ మిల్లీ లీటర్ లేదా థయోమిథాక్సాం 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సా ఫ్లోర్ 0.75 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండి నల్లి :

పత్తి పంటను పిండి నల్లి ఆశించినప్పుడు చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లి పురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత కలిగిన వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఈ పురుగులు ఆకు తొడిమల నుంచి పూత, కాయల నుంచి రసం పీల్చడం వల్ల ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయి. పిండి నల్లి నివారణకు ప్రొఫెనోఫాస్ 50 ఈ.సీ లేదా మిథైల్ పారాథియాన్ 50 ఈ.సీ ఎసిఫేట్ రెండు గ్రాములతోపాటు ట్రిటాన్ లేదా సాండోవిట్ లాంటి జిగురు మందులను ఒక మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామర పురుగు

పత్తి పంటకు తామర పురుగు ఆశించినప్పుడు తల్లి, పిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులోకి మారుతాయి. ఆకు అడుగు భాగాన రసం పీల్చడం వల్ల ఆకులు పెలుసుగా మారుతాయి. ఆకుల అడుగున ఈనెల వెంబడి వెండి వలే మెరిసే చారలు కనిపిస్తాయి. తల మాడు తెగులు పత్తిలో తామర పురుగుల వల్ల వ్యాప్తి చెందుతుంది. తామర పురుగు నివారణకుగాను మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 75 ఎస్.పీ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా డైఫెంథయూరాన్ 1.25 గ్రాములు లేదా స్పైనోటోరం 0.9 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

నూతన పద్ధతులతో వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్

● నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్ : నూతన పద్ధతులు అవలంబిస్తూ ప్రయోగాత్మకంగా వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ చేపట్టాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్‌హాల్ కాంప్లెక్స్‌లో మంగళవారం నిట్ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఐఐటీ ఖరగ్‌పూర్, కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'అడ్వాన్స్‌సెస్ ఇన్ బయోలాజికల్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ అండ్ ఇంటిగ్రేటెడ్ ఆఫ్ అకడమిక్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. బయోలాజికల్ వ్యర్థాల సేకరణలో మున్సిపాలిటీ పాత్ర కీలకమని, మురుగు నీటిని ఉపయోగకరంగా మార్చేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ రాఘవన్, ప్రొఫెసర్లు శిరీశ్ హరి, పి.వి.రావు, సూరజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో అధికారుల తనిఖీ

- అమ్మవారికి సమర్పించిన నైవేద్యం, ప్రసాదం పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచన



పులిహోర ప్రసాదాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ముడిసరుకులను పరిశీలిస్తున్న అధికారులు

హన్మకొండ కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని ఉపయోగించారనే అంశంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నెయ్యిలో జంతు సంబంధిత కొవ్వు కలిసినట్లు తలెత్తిన ఆరోపణల సెగ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయానికి తాకింది. మంగళవారం శ్రీభద్రకాళి ఆలయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఆహార పరిరక్షణ అధికారి చేపూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ శేషుభారతితో కలిసి అధికారులు అమ్మవారికి నిత్యం సమర్పించే నైవేద్యం, ప్రసాదాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రసాదం, నైవేద్యాలు తయారు చేసే వంట గదుల శుభ్రత, లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి, ఇతర పదార్థాల గురించి ఈఓను అడిగి తెలుసుకున్నారు. కల్తీపై ఆరాతీశారు. వాటి నాణ్యత పరిశీలించిన అనంతరం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. భక్తుల విశ్వాసం చూరగొనేలా నాణ్యతకు పెద్ద పీట వేయాలని పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేషుభారతి మాట్లాడుతూ అమ్మవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగదని, నిత్యం శుభ్రం , నాణ్యతాప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. గత ఫిబ్రవరి (2024)లో భారత ప్రభుత్వ ఆహారపరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ ప్రతినిధులు 'ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్‌షిప్' సర్టిఫికెట్‌ను దేవాలయానికి జారీ చేశారని తెలిపారు. ఏపీ ఫెడరేషన్ విజయ కంపెనీ నెయ్యి వాడుతున్నామని, భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరిండెంటెంట్ అద్దంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వినియోగదారులకు శుభవార్త..

- తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలు
- ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ ద్వారా విక్రయాలు
- ఈ-కామర్స్ ద్వారా కొనుగోళ్లకు అవకాశం

హన్మకొండ: వినియోగదారులకు శుభవార్త. ఇక నుంచి కరెంట్ బిల్లుల మోత నుంచి ఉపశమనం పొందొచ్చు. విద్యుత్‌ను ఆదా చేసే శక్తి, సమర్థవంతమైన ఉపకరణాలు కొనుగోళ్లకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ-కామర్స్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. ఈ ఉపకరణాలు తక్కువ ధరకు లభించడంతో పాటు విద్యుత్‌ను పొదుపు చేస్తాయి. వినియోగదారులను విద్యుత్ పొదుపు వైపునకు ప్రోత్సహించడానికి 5 స్టార్ రేటింగ్ కలిగిన ఉపకరణాలను 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్' అనే సంస్థ.. ఈ-కామర్స్ మార్కెటింగ్ ద్వారా విక్రయిస్తోంది. ఈ ఉపకరణాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఉపకరణాలు వినియోగించడం ద్వారా మూడు సంవత్సరాల్లో వీటి కొనుగోళ్లకు చేసిన పెట్టుబడిని విద్యుత్ పొదుపు రూపంలో పొందొచ్చని ఇంజనీర్లు చెప్పారు. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టౌవ్, 5 స్టార్ బీఎల్‌డీసీ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియెంట్ ఏయిర్ కండీషన్ (ఏసీ)లు, ఎల్ఈడీ ఇన్వర్టర్ బల్బులు ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టర్‌లో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి అందుబాటులో ఉన్న ఉపకరణాలు కొనుగోలు చేయొచ్చు. ఆర్డర్ చేసిన వస్తువులు నేరుగా ఇంటికి డెలివరీ అవుతాయి. వినియోగదారులు ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి కావాల్సిన ఉపకరణాన్ని ఎంచుకున్న తర్వాత ఈ-మెయిల్‌తో లాగిన్ కావాలని కోరుతుంది. లాగిన్ కాగానే చిరునామా వివరాలు నమోదు



ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు (లోగో)

చేయాలి. తర్వాత చెల్లింపులు చేసే విధానం చూపుతుంది. వినియోగదారుడు తనకు అందుబాటులో ఉన్న విధానంలో ఉపకరణానికి సంబంధించిన సొమ్ము చెల్లించగానే బుకింగ్ కార్యక్రమం పూర్తవుతుంది. ఆ తర్వాత నిర్ణీత సమయంలో వినియోగదారుడికి డెలివరీ అవుతుంది. అదే విధంగా ఈఈఎస్ఎల్ పేజీలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా ఆర్డర్ చేసుకునే వెసులుబాటు ఉంది.

నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఉత్తమ వేదిక



నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఈ-కామర్స్ మార్కెటింగ్ ఉత్తమ వేదిక. ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టల్‌లో విద్యుత్ పొదుపు చేసే నాణ్యమైన, సమర్థవంతమైన విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ పొదుపు చేయడమంటే డబ్బు పొదుపు చేసినట్లే. ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వినియోగదారులు సరసమైన ధరలకు కొనుగోలు చేసుకోవచ్చు. మన్నిక కలిగి ఉండడంతో పాటు విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చు.

– కె.వెంకటనారాయణ, ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ

మహా నగరాభివృద్ధి లక్ష్యం

- నాడు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు దోచుకోని.. దాచుకున్నారు
- పార్టీలకతీతంగా డివిజన్లకు నిధులు కేటాయిస్తాం
- రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ అర్బన్ : మహా నగరాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని, హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పంతో ఉన్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి హాజరైన అనంతరం మంత్రి సురేఖ విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకోని దాచుకుందని విమర్శించారు. పది నెలల క్రితం అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టిస్తున్నారన్నారు. ఆరుగ్యారంటీల అమలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ నగర అభివృద్ధికి మూడేళ్లకు రూ.900 కోట్ల ప్రకటించి నిధులు అసంపూర్తిగా విడుదల చేసిందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. నగరంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారిస్తామని, పార్టీలకతీతంగా డివిజన్లకు నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. బతుకమ్మ, దసరా పర్వదినాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. నగరంలో డెంగీ, మలేరియా, ఇతర వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, 40 ఏళ్ల పైబడిన మహిళలను గుర్తించి వారికి మల్టీ విటమిన్ మందులు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతీ డివిజన్‌కు రూ.30 లక్షల నిధులు..

ప్రతీ డివిజన్‌కు రూ.30 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు మేయర్ సుధారాణి తెలిపారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం, స్మార్ట్ సిటీ, ఇతర ప్రభుత్వ నిధులతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.

కౌన్సిల్ ప్రశాంత వాతావరణంలో జరిగింది..

పార్టీలకతీతంగా కార్పొరేటర్లు ప్రజాసమస్యలను ప్రస్తావించేందుకు అవకాశం కల్పించి, ప్రశాంత వాతావరణంలో కౌన్సిల్ నిర్వహించినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. వచ్చే నెలలో సీఎం రేవంత్ రెడ్డి వరంగల్‌కు విచ్చేస్తున్నారని, నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఊహించని విధంగా నిధులు కేటాయించనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

విలీన గ్రామాలపై దృష్టిసారించాలి..

పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలోని విలీన గ్రామాలలో సమస్యలపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి సూచించారు. క్షేత్ర స్థాయి సమస్యలు గుర్తించి ప్రతిపాదనలు అందజేయాలన్నారు.

నయీంనగర్ నాలా ఆధునీకరణతో తప్పిన ముంపు బెడద..

హనుమకొండ నయీంనగర్ నాలా ఆధునీకరణతో పదుల సంఖ్యలో కాలనీలకు ముంపు బెడద తప్పిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. అందుకు సీఎం రేవంత్ రెడ్డికి, చొరవ తీసుకున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నా పదవిని అవమాన పరిచారు

కౌన్సిల్‌లో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా తన పదవిని అవమానించారని డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. సభను వాకట్ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. వ్యక్తిగత సమస్యలు కాదని, ప్రజాసమస్యలు ప్రస్తావించేందుకు ఎందుకు అవకాశం ఇవ్వరని ప్రశ్నించారు.

మేయర్ సుధారాణి.. మా నోరు నొక్కారు

బీఆర్ఎస్ పార్టీపై గెలిచి మేయర్‌గా తమ ఓట్లతో ఎన్నికైన మేయర్ సుధారాణి.. తమను మాట్లాడనీయకుండా తమ గొంతు నొక్కారని కార్పొరేటర్ మరుపల్లి రవి పేర్కొన్నారు. దశల వారీగా ఆందోళలు వ్యక్తం చేస్తామన్నారు.

యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

27లోగా రిజిస్ట్రేషన్ల పూర్తి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- కలెక్టరేట్‌లో టూరిజం ప్రమోషన్ కౌన్సిల్ సమావేశం



టూరిజం ప్రమోషన్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో ఈనెల 27లోగా యువ టూరిజం క్లబ్ రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా టూరిజం అధికారి ఎం.శివాజీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా టూరిజం ప్రమోషన్ కౌన్సిల్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి అధికారులను ఆదేశించారు. టూరిజం సెక్రటరీ ఆదేశాల మేరకు టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను పేర్కొన్నారు. జిల్లా టూరిజం అధికారి ఎం.శివాజీ మాట్లాడుతూ జిల్లాలో ఏకో టూరిజం, ఇతర ప్రాజెక్టులను అటవీశాఖ అధికారుల సమన్వయంతో పూర్తిచేస్తామని తెలిపారు. పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లు నాయక్, కేంద్ర పురావస్తు శాఖ అధికారి మల్లేశం, డీఈఓ వాసంతి, ఆర్టీసీ మేనేజర్ ధరంసింగ్, టూరిజం డీఈఎం ధనరాజ్, డీఐఈఓ గోపాల్, ఫారెస్ట్ అధికారి భిక్షపతి, నీటి పారుదల శాఖ అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు

జిల్లాలో పకడ్బందీగా ఓటరు నమోదు చేపట్టినట్లు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్ఓ నెట్ 2.0పై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఈసీ సూచన మేరకు కొద్దిరోజుల నుంచి నూతన ఓటరు నమోదు కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పనితీరు మెరుగుపడిందన్నారు. బూత్‌స్థాయి అధికారుల ద్వారా 100 శాతం ఇంటింటి సర్వే పూర్తిచేస్తామని ఆమె పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, నారాయణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

క్యాంటీన్లను రెస్టారెంట్లుగా మార్చాలి

హసన్‌పర్తి: ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లను రెస్టారెంట్లుగా మార్చాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో కలిసి కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. అవసరమైతే శుభకార్యాలకు ఆర్డర్లు తీసుకుని డెలివరీ చేసే స్థాయికి ఎదగాలని కోరారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లకు రూపకల్పన చేసిందని వివరించారు. డీఆర్డీఓ నాగపద్మజ, ఏపీఓ శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్త ఆరెల్లి వెంకటస్వామి, జె.రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, శాంతి మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల

నూతన కార్యవర్గాల ఎన్నిక



వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొమురారెడ్డి, జనరల్ సెక్రటరీ రమణాకర్



హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మహిపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సమావేశాలు వేర్వేరుగా జరిగాయి. పలు సమస్యలపై చర్చించిన అనంతరం ఆయా జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎల్.కొమురారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.రమణాకర్, సంయుక్త కార్యదర్శిగా బి.హరికృష్ణ, కోశాధికారిగా జి.శశిధర్, మహిళా కార్యదర్శిగా పి.ఉమాదేవి, కార్యవర్గ సభ్యుడిగా సీహెచ్.వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారిగా పి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర పరిశీలకులుగా వీరమల్ల బాబురావు, ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు.

హనుమకొండ జిల్లా..

హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వి.కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా టి.మహిపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర పరిశీలకుడు ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

తొర్రూరు మాజీ సర్పంచ్‌కు మూడేళ్ల జైలు



తొర్రూరు: గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన తొర్రూరు మాజీ సర్పంచ్ ధరావత్ రాజేశ్‌నాయక్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. 2013లో తొర్రూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న రాజేశ్‌నాయక్ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటి ఎస్సై రాయల వెంకటేశ్వర్లు పట్టుకుని కేసు నమోదు చేశారు. సీఐ రాజు విచారణ చేపట్టి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి మట్ట సరిత .. మాజీ సర్పంచ్ రాజేశ్‌కు మూడేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.